# బొమ్మ చిలుకలు

" చిలకలకు, పువ్వులకు చిత్త మిచ్చేవు!
చిలక యెగిరిపోతే, నీవు చేసేదేమిటి?
కులుకులకు, పురుషులకు హృదయ మిచ్చేవు:
కులుకు తీరిపోతె, వాళ్లో వాలికేదేమిటి?
పురుష డెళ్ళిపోతె చెల్లీ పోల్చెదెవరిని?"

ఇదోనాటి తత్వం కాదు. ఏనాటి తత్వమో యీనాటికీ పాడబడుతూనే వుంది ఆనాటున. ఏనాటికీ పాడబడుతూనే వుంటుంది రాటుదేరిన నోళ్ళచే

" ఆఁ....చిలకలకు!
ఆఁ....కులుకులకు!"

ఆలకించేవా డుండాలి! అంతే. ఆవతలవాడు, ఆపాటగాడు ఆమెకు ఆ వేడెకు అనుంగు సోదరుడై యుండాలి. "చెల్లీ!" అని సంబోధిస్తూ.

అది ఒక్క సన్యాసికే స్వాధీనం. సర్వసంగ పరిత్యాగికే సాధ్యము. ఉదయాన్నే పాడుతూ వీధినే కనపడ్డాడు. వేమన యోగితో సమానంగా " విరాట్‌కవి " బిరుదు వహించే విబుధానందుడు. విబుధానందుడు లోకాతీతుడు. లోకాతీతుడని ఈ లోకంతో తెగతెంపు గావించుకొన్నవాడు కాడు. పాడేపాటకు, చూసే తన దృశ్యానికి ఏదో బాదరాయణ సంబంధం వుంచుకుంటూనే వుంటాడు.

తెల్లాఅలే దింకా సరిగ్గా! ఆవలివీధికి సింహద్వారం, ఈవలి వీధికి పెరటి గుమ్మంవున్న ఒకానొక ఐశ్వర్యవంతుని ఇంటివెనుక భాగమందలి ఖాళీ 'గరాజీ' ముంగిట ఒక కార్మిక కనకాంగి– పేరు? అప్పుడే బేరం చేస్తూవుంది ఒకానొక విలాసవస్తువును.

అమ్మేవాడు అవేళ కంత పెందలకడే ఎలా తయారయ్యాడో! బహూ ఆశ్చర్యం!

విబుధానందుడు ఆ దృశ్యాన్ని చూస్తూ విసిరేదు పైపాట. పేరు తెలియనప్పుడు ఆమెను ఆమెయొక్క వంటివన్నెనుబట్టే పిలిచిచూద్దా! తప్పేం?—కనకాంగి "నేవీబ్లూ" జాకెట్ తొడుకుంది. పచ్చటి వలుదబుజాల్ని, చేతులంతగా పైకెగసిపోని ఆ చనుగప్పు అతి సుందరంగావుంది. రిచ్చగోల్పే పసుపుపచ్చటి జీర కచ్చాపోసి కట్టింది. మొల్లో చింతకాయ వాటపు తాళపు చెవుల గొలుసు ముమ్మెలికవేసి గ్రుచ్చింది. మెళ్లో రాళ్ళపతకం సరిగా గొంతుమిడి దిగువ కుండకు మూతగా తార్చింది. బహుశా తీగె నమర్చింది అయివుండాలి. చెవల్ని రవలదుద్దులెట్టింది. ఆ ముఖంవంక చూస్తూవుంటే ఆ దుద్దులు ఇమిటేషన్ పొల్లవా అనే సందేహమే తోచదు. ఇంతకూ ఆ పొళ్ళను మెల్లసూచిందను కుంటాను విబుధానందుని పాట. అంచేతే ఆ మిరించు!

వెంటనే బేరమూసుకు వేదాంత తత్వపు వరుసపెట్టి అడదొడగింది ఆ పడుచు.

"దూడవేసే పేడబొమ్మ - బేడ ఏంటిరా?"

అని అమ్మేవాడు సామాన్యుడా? వాడున్నూ లయకు లయ, హొయకు హొయకాపరుస్తూ—

"ఎంత ఇస్తె నీకు బాగొ అంతె ఇవ్వమీ్మ!"

అన్నాడు.

అణా ఆమెనుండి తీసుకొని వర్తకుడు మట్టితో చేయబడ్డదో పేడతో చేయబడ్డదో లేక రెండింటితోను గూర్చబడ్డదో-ఏదైతేం, చక్కని ఆకుపచ్చ రెక్క, ఎఱ్ఱటి ముక్కు ఉంచబడ్డ చిలకన్ను ఆమెచేత బెట్టి వీధిని యథావిధి నడవబోయాడు. సరిగా దాని కడ్డంగా విబుధానందుడు దసులయి—

" మాడచేసే క్రీడసెమ్మా నీడదేనిది?
ఆరిపోని దీప ముంది చూడరానిది!"

అని పాడాడు. వర్తకుడు స్వామిజీకి నమస్కరిస్తూ "తమర్నీదాకా కానలేదు, క్షమించండి!" అన్నాడు. 'నారాయణ' అంటూ విబుధానందుడు ముందుకు సాగబోయాడు.

వర్తకుడు ఆలోచనగా నిలబడివున్నాడు. విబుధానందుడు వెనక్కి తిరిగి ఆగి "ఏం? నిలబడిపోయినావు?" ప్రశ్నించాడు. "ఏమీలేదు! తమర్నిచూస్తూ!" అన్నాడు. "నన్నా? ఆమెనా?" అన్నాడు విబుధానందుడు. "క్షమిస్తే చెప్తాను. మిమ్మల్ని ఆమెనూ కూడా చూచి" అన్నాడు వర్తకుడు. "కూడాకూడా కాదుకదా?" అన్నాడు విబుధానందుడు చిరునవ్వు నవ్వుతూ. వర్తకుడు లెంపలు వేసికొంటూ "దూడవేసే పేడబొమ్మా" అని ఆమె పాడితే, తమరు "మాడచేసే క్రీడసెమ్మా" అని సెల విచ్చారు. ఆ సంస్కృతియందలి అన్యోన్యత ఎక్కడిదీ అని ఆలోచిస్తూ విస్తుపోతున్నాను. విప్పిచెప్పడానికి అలవి అయితే సెల విప్పించ గోరుతున్నాడీ దాసుడు. అని ప్రాధేయ పడ్డంతగా తన నడ్డి వంచాడు వర్తకుడు.

"ఆమె నాకు సోదరి" అన్నాడు విబుధానందుడు. "సాయానా తోడబుట్టింది?" అని అడిగాడు వర్తకుడు. దానికి జవాబు చెప్పకుండానే విబుధానందు డేదో ఆలోచిస్తూ ఆకాశం కేసి చూసి "కాని ఆమె పాడయిపోయింది" అని అన్నాడు. "ఎప్పుడు? నేనెప్పుడూ ఆమెను మంచి మనిషిగానే చూస్తూ వున్నానే" అని వర్తకు డబ్బురపోయాడు. "ఇప్పుడే, ఈమేష మప్పుడే, నీవద్ద చిలుకను కొన్న క్షణికమప్పుడే!" నన్నాడు విబుధానందుడు. వర్తకుడు చప్పుచప్పున తనచేతి నింకా అమ్ముడుపోని చిలకలపై బట్ట కప్పెట్టి "తప్పునాది! ఆమెది కాదు" అన్నాడు వర్తకుడు.

"మఱి తీసుకురాకు నీ చిలకల్ని ఈ ప్రక్కకు" అని ఆజ్ఞగా వచించాడు స్వామిజీ. వర్తకుడు "ఏప్రక్కకు తీసుకు వెళ్ళను. తమముందే వీటినన్నిటినీ బ్రద్దలు గొట్టేస్తున్నాను" అని కప్పెట్టిన బట్ట బట్టాలా వుండగానే చేతెడు చిలకల్ని రోడ్డు మీద జారవిడిచాడు. తుత్తినియ లైనాయి—తోకవిరిగి ముక్కు విరిగి, కాళ్లు విరిగి అవన్నీని! అన్నింటికంటే చిత్రం! లోపటి మన్ను మశానం అక్కుల్లో దుమ్ముగా రేగింది. పక్కిరూపాలే కాన్నట్టు! ఆవల తూర్పుదిక్కున గుల్లవుడకపోస్తూ సున్నపు కుండ సూర్యభగవానుడు పగలగొట్టాడా అన్నట్టు బళ్లున తెల్లారింది.

దూరాన్నే వర్తకుని ముదుసలి తల్లి మూడుముప్పైలు తొంబైయేళ్ళు కడచన్న వయసు రెల్లుపూత పూసిన తడువున తల అదీ మాడపట్టున పేడతట్ట పెట్టుకు మోసికొంటూ వస్తూవుంది.

ఆమె తెల్లటి కనుబొమ్మల్ని ఓపిక లేకపోయినా లేవనెత్తు కున్నదై వర్తకుడైన తన కొడుకును అనవాలు పడుతూ వాని ముందు చెదిరిపడివున్న చేత చిలకల చిద్రుపలనుగంటూ "ఇక నేను పేడప్రోగుచేసి నీచిలకల చేతికిస్తే వొట్టు!" అంది. లోపల పొడమిన కోపం చాలామట్టుకు దిగమింగిందో ఏమో స్వామిజీని తోడ్తో సందర్శిస్తూ, లేకుంటే ఆతట్ట పుచ్చుకు తన కొడుకు నెత్తినే కొట్టివుండక పోయేదా?

వాడు ఆవర్తకుడు తన కళ్ళంట నీళ్లుగార విబుధా నందుడు వర్తకుడి వంకగాని, ఆ ముసిలి అవ్వకేసిగాని చూడలేక పోయినాడు. అలా నేలంకచూస్తూ స్థబ్దుడయ్యాడు ఒక్క క్షణం. నేలమీద ఆ జోగికి పేడపోగుతప్ప మరేమీ కనిపించలేదు. మిగతా ప్రపంచం అంతా మరచిపోయినాడు.

వర్తకుడు "ప్రభూ! నా తల్లికీ నాకూ ఈ వర్తకమే యీ క్షణంవరకూ ఈ లోకంలో ప్రవర్తనం. ఆమె వొండ్రూ, గంద్రిసుకా,

గోమయం, గోదావరిగంగా తెస్తూవుంటే నేను చిలకలుగ, చిన్నారి పొన్నారి ఆటవస్తువులుగా చేసి రంగుపూసి రక్తము పోసినంత రూపం యిచ్చి రోజూ ఓ రూపాయ గడించుకుంటూ నాతల్లిని పోషించి నేను శోషిల్లకుండా వుంటూ వచ్చాను ఈఘడియదాకా. ఈపైనుండి నన్నేమి చేయమని తమ సెలవు" అని అడిగాడు. విబుధానందుడు ఆ విపరీత సంఘటనకు నివ్వెర పోతూ ఎట్టకేలకు చిరునవ్వు తెచ్చుకున్నవాడై "నీ ముసిలితల్లి రేపటి యుదయంలోపున కాలంచేసి తీరుతుంది. మరి ఆమెకు ఆకలివేయదు, దప్పిక పొడమదు, నీ సేవ కించిత్తూ అపేక్షించదు" అని జవాబు ఇచ్చాడు: "ఈలోపుగా ఆమెకు ఏమి పోసేది ?" "తులసి తీర్థం! తులసి తీర్థం!" అంటూ వెళ్ళిపోయినాడు విబుధానందుడు.

వర్తకుడు తన తల్లివంక చూచేడు. ఆమె తల తిరిగినట్టు విబుధానందుకేసి ఒక వెఱ్ఱిచూపుచూచి, నేలకొరిగి పడిపోయింది. "అమ్మా!" అని గావుకేకవేస్తూ తల్లినల్లా తన వొడిలోకి జేర్చు కొన్నవాడై వర్తకుడు తలపోశాడు. "ఈబైరాగివోళ్ళ గుండెకాయలు గుండ్రాళ్లు. అబ్బా! అబ్బా! అచెప్పే జోశ్యం నా పెళ్లినిగురించో, నేతినబోయే పిండివంటను గురించో చెప్పక ఈ ముదిముండ చావునుగురించి చెప్పిపోయాడే? ఎవడు అడిగాడు వీనినీ ప్రశ్న ? వెనుక్కుపిల్చి కనుగొందామన్నా వినిపించుకోనేరని విఱ్ఱవీగుతో సాగిపోయినాడే!" అని ఆయాసపడుతూవున్న తల్లివంక చూచి "అమ్మా! అమ్మా!" అని పలకరించాడు అమెను. ఆమె కప్పుడే మాట కొఱుకుపోయింది. మంచినీళ్ళన్నా అడిగే హవాలు కూడా లేని దయింది.

"గరాజి" నివాసంనుండి కనకాంగి ఉత్తచేతుల్తో వెలికి వస్తూ "ఒక్క చిలుకవెల విషయమై అంత ఖరాఖండీ చేసిన షాహుకారిని నీవు ఎలా జారవిడిచావురా అన్న చిలకల్ని ఛిన్నా

భిన్నాలుగా ఎలా చేశావురా!" అని అడిగింది. అన్నిటికంటె ముందక్కడ జరిగిన ఘాత కనిపెట్టి వర్తకుడు "ఇంతపనీ ఇందాకటి సన్యాసి నాచేత చేయించాడు. ఏమి చెప్పను?" అని తన కళ్ళనీళ్లు తనతల్లి పెదవులమీద పడేటట్టు ఏడువసాగాడు.

కనకాంగిని ఆ వర్తకుని కంటినీటిధారనీ, అతగాని వొడిలో చావుకు సిద్ధంగానున్న వృద్ధురాలిని గాంచింది. "ఆమె ఎవరు?" అని అడిగింది. "ఇంతలో స్వర్గమునుండి దిగి ఇంతలో ఇంత వృద్ధాప్యంగన్నవా రుంటారా? ఈమె నాతల్లి! ఏమూలా ఆమె గానే తెలిసిన మా అమ్మ! నా పేడబొమ్మలకు దిమ్మనుండి దివిటీదాకా సరఫరాచేసిన సేవాపరాయణి" అని జవాబు చెప్పాడు వర్తకుడు.

ముసిల్దాని ముఖమ్మీది కప్పుడే ఎండ సలసలా ప్రసరింప జొచ్చింది. "ఇలా నీడకుజేర్చు ఆమెను" అంది కనకాంగి. అని 'గరాజి' తలుపు బర్రునతోసింది. లోపల అదంతా ఎంత ఖాళీగా వుండాలో అంత ఖాళీగావుంది. వర్తకుడు కానకాంగిచే ఆసరామీద తన తల్లిని ఆ 'గరాజి'లోకి సాయం పట్టినవాడై "వైద్యునికొఱకు వెళ్ళివస్తాను కాస్త కనిపెట్టి చూస్తూవుండు!" అని నివాసం యొక్క నకమొకాలూ ఉపలక్షించి మంచం కుంచం లేని ఈ ఖాళీ గరాజీ ముస్తాబుకోసమేనా పొద్దున్నే నావద్ద నీవు చిలకను కొన్నది?" అని ప్రశ్నించాడు.

వానికా వేళప్పుడు తల్లిప్రాణం వచ్చీపోయీ స్థితిలో నున్నప్పుడు ఆ ప్రశ్న వేయాలని బుద్ధి ఎలా పుట్టిందా? అని విస్తుపోతూ కనకాంగి మిన్నకుంది. వర్తకుడేదో నిర్వికారపు దృష్టిని వెళ్ళిపోయాడు.

ముసిల్ది "ఇంకెక్కడి చిలుకలు! అన్నీ పగులగొట్టు కూర్చున్నాడు మావాడు! మంచం ముస్తాబుకూ కుంచం ముస్తాబుకూ లేవు" అని కలవరించింది. "లేదు. అన్నీ పగిలిపోలేదు.

నావద్ద వొకటి వుంచి వెళ్లాడు" అని కనకాంగి తానా యుదయం కొన్నదాన్ని కళ్లకద్దుకొన్నట్టుగా కాపరిచింది. నీకూరికే ఇచ్చాడా దీన్ని? అని అడిగింద ముసిల్ది. కళ్ళువిప్పి కుసింత తెప్పిరిల్లినట్లు తెలివి బాటి "లేదు రొఖ్ఖంచి తీసికొన్నాడు అణా! వాడు నీకొడుకా?" అని అడిగింది కనకాంగి. "అవును పిల్లా! నీవు ఎవరికూతురవు?" అని ముసిల్ది అడిగింది. "నేను కాసా భీముడి కూతుర్ని. అదిలో మా జమీందారుగారికి గుర్రం గుర్రపుబగ్గీవుండేవి. వాటి చాటునా మాటునా రెండో కంటివాళ్లకు తెలియకుండా మాబాబూ మా అమ్మా కాలక్షేపం చేసేవారు ఈ గరాజిలోనే! అయితే గుర్రం పోయింది, బగ్గీపోయింది, జమీ జమీందారూకూడా ఎగిరిపోయారు-మా బాబూ అమ్మా పోవడంతోనే అయితే 'గరాజీ' అలాగే నిల్చివుంది. ఈ గరాజీలోనే మా అమ్మ నీళ్లాడి నన్ను కన్నాను అన్నది. నేనూ అలాగే నిల్చివున్నాను ఈనాటికీని" అంది కనకాంగి. ముసిల్ది రెప్పపాటు కాలం తన ఎదరనున్న వొప్పులకుప్పను దీవించినట్టు చూస్తూ పుట్టినోళ్లు పుట్టినట్టు ఎప్పుడూ వుండరు పిల్లా! పుట్టినప్పటికంటె పొడుగవుతారు. పులుపు గొలుపు నేరుస్తారు పిల్లా!" అని వొక్క నవ్వు నవ్వింది. నవ్వుతూనే ఆయవ్వ ప్రాణం వదిలింది.

కనకాంగి ధ్యానం అంతా అప్పుడు—

"చిలక యెగిరిపోతే నీవు చేసేదేమిటి"

అన్న విబుధానందుని పాటలోని చరణాలయొక్క ఉటంకింపు మీదనే వుండింది.

ఉత్తర క్షణాన్ని వర్తకుడు తన వైద్యుడిచ్చిన ఒక మాత్ర తెచ్చి వేయబోయినాడు, గాని కనకాంగి వారించి మఱి లాభం లేదంది.

"అశుభమో శుభమో మన మిద్దరం పెళ్లాడుకొందాం అన్యోన్యం" అని ప్రతిపాదించింది. "ఇప్పుడు తెలిసిందా?

నీదగ్గఱ ఈయుదయాన్నే ఆ చిలకను ఎందుకొన్నానో? మన గది ముస్తాబుకోసం!" అని కులుకుకూడా కొసరించింది ఆపిల్ల. వర్తకుడు ఇటూ అటూ తిలకిస్తూ "స్వామీజీ అవివేకి గాడు!" అని ఒక్కసారి స్మరించాడు. వర్తకుని మనస్సునందలి పరివర్తనం చెప్పనలవికాదు. గరాజీ గోడలు బంగారు మలామా పూత గొన్నట్టు కనకాంగి సిగ జాడే అర్ధరాత్రి పున్నమరేని మల్లె మొగ్గలు సిగ్గువిడచి నడచినట్టు దర్శనమైంది. కనకాంగి వాని వైఖరిగంటూ-వర్తకుని తిరుగ మామూలు మనిషిగా తయారు చేయడం ఏలాగా అని యోచించింది.

ఆమె నాటి యుదయం కొనుక్కున్న వొకమట్టి చిలుకను తిన్నగా వర్తకుడు చూస్తూవుంటే నేలనేసి కొట్టింది. వర్తకుడు తెల్లబోతూ "నమోనాకూడా లేదే యింకనాకు!" అన్నాడు అతి జాలిగా. "నమోనా కూడాను!" అని పరిహసించింది కనకాంగి. "నమోనా కూడాను!" అని కనికరించాడు విబుధానందుడు. వర్తకుడు కేవలం ద్వంద్వంలో పడ్డాడు!

... ... ... ... ...

## ఏటివొంక గుజగుజలు

నిగనిగలాడే నీలాపువొళ్ళు, సగాని సగం జారిపోయిన పయట, సొగసుగా మొక్కజొన్నపొత్తు తింటూ తెలిపళ్ళు, చిరునవ్వు నొక తూరి, గింజకొఱకు నొకతూరి, బయట కాపరుస్తూ హొయలుపోతూ కూర్చుంది! ఆ యెమ్మెలాడి కోయచిన్నది కావచ్చు! కొండ చిన్నది కావచ్చు!

నాగరీకులైన కామాటీలు చుట్టూ మూగివున్నారు. ఆమె ముందు కేటాయింపబడి ప్రదర్శనమవుతూవున్న మూలికలు,